క్లుప్తంగా

మనూలో ఆన్‌లైన్ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ ఎఫ్‌డీపీ

రాయదుర్గం: మనూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రెండు వారాల ఆన్‌లైన్ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని 'మనూ' సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్ (సీపీడీయూఎంటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్దీఖీ తెలిపారు.అక్టోబర్ 9 నుంచి 21వ తేదీ వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అడ్వాన్స్‌డ్ పెడగోగీస్‌పై రెండువారాల పాటు ఆన్‌లైన్ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు మరిన్ని వివరాల కోసం సెంటర్ ఫ్యాకల్టీలు మిస్బాఅంజార్(9948412484), మహ్మద్ అక్బర్(8373984391)లో సంప్రదించాలని కోరారు.

బీసీ వర్గాలకు అవకాశం ఇవ్వాలని రాస్తారోకో



పెద్దకంజర్ల రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన నీలం మధుకు అవకాశం కల్పించాలని సబ్బండ వర్గాల నాయకులు డిమాండ్ చేశారు. పెద్దకంజర్ల గ్రామంలో గురువారం రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నీలం మధు బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడ్డాడని ఎమ్మెల్యే టికెట్‌పై పునరాలోచించుకోవాలన్నారు.బీసీ సామాజిక వర్గానికి కేసీఆర్ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో తామంతా నీలం మధు ముదిరాజ్‌ను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయించి గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గంగయ్య, ఊట్ల మహేష్, నర్సింలు ,రమేష్, ముత్యాలు, నాగభూషణం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో సత్తా చాటుతాం..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రానున్న ఎన్నికల్లో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తమ సత్తాను చాటుతామని తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముక్కెర రమేష్, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ శక్తివంతంగా ఉందని తెలిపారు.కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

- 22 సిగరెట్లు స్వాధీనం

గచ్చిబౌలి: గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత ఈ-సిగరెట్లను విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో వాట్సాప్‌లలో ఆర్డర్లు పెట్టి, కొరియర్ల ద్వారా కాలేజీల విద్యార్థులకు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్ఓటీ, రాయదుర్గం పోలీసులు బేగంపేట్‌కు చెందిన రాధా మాధవ్(19), అచ్యుత గౌతం రాకేష్(21)లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మూడు లక్షల విలువ చేసే 22 ఈ-సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఐబీఎస్ కళాశాల విద్యార్థి రాధా మాధవ్ ఆన్‌లైన్‌లో ఈ-సిగరెట్ల వ్యాపారం చేశాడు. కోలకతాకు చెందిన దీపక్, యష్, ముంబైకి చెంది తేజ్ వాట్సాప్‌లో ఆర్డర్‌చేయగా కొరియర్ ద్వారా ఈ-సిగరెట్లను పంపిస్తున్నారు. పంజగుట్ట అమిటీ బిజినెస్ కళాశాల, శంకర్‌పల్లి ఇక్ఫాయ్ కళాశాల, బాచుపల్లి మహీంద్ర కళాశాల, కొండాపూర్ సంస్కృతి కళాశాల, షేక్‌పేట్ ఆకాష్ ఇనిస్టిట్యూట్, పటాన్‌చెరు గీతం కళాశాలకు చెంది 63 మందికి, 71 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ఈ-సిగరెట్లు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ-సిగరెట్ల వాడకంతో అనారోగ్యం బారిన పడతారని పోలీసులు సూచిస్తున్నారు.

కుట్టుమిషన్లు అందజేత

మోతీనగర్: నిరుపేదల కోసం లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ శాఖ ఎప్పుడు ముందు ఉంటుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేల వెంకట్రావ్ పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో మహిళలకు ఆయన కుట్టుమిషన్లను అందజేశారు. అనంతరం రెయిన్‌బో పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, అన్నదానం, వస్త్రదానం, పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు సైతం చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కైలాష్, క్రాంతికర్, రోణంకి జగన్నాథం, నాగుల సత్యం గంగపుత్ర, ఆదినారాయణ, ప్రతాప్, పిఆర్‌కే, అమర్‌సింగ్, కిరణ్, శ్రీలత, రాధిక, రాణి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి







శిల్పారామంలో..



మదీనాగూడలోని శ్రీకృష్ణ ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గాంధీ



టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

శేరిలింగంపల్లి: శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని గురువారం యాదవ్ సంఘం ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం లింగంపల్లిలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు గడ్డం రవియాదవ్, ప్రతినిధులు సోమయ్య యాదవ్, బండప్ప యాదవ్, నర్సింహయాదవ్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఘనంగా పూజలు

రాయదుర్గం/హఫీజ్‌పేట్: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. గురువారం టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలంయలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో వేడుకలను ఆలయ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి, డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వివివిఎస్‌శర్మ పర్యవేక్షణలో నిర్వహించారు.కాగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో పలు చోట్ల చిన్నారులకు చిన్నికృష్ణులవేషధారణలో చేసి తల్లిదండ్రులు మురిసిపోయారు.

శిల్పారామంలో ..

మాదాపూర్: కళాకారులు శ్రీకృష్ణ వేషధారణతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో గురువారం శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గురువు దుర్గేష్ నందిని, ప్రణవి తుమ్మాటి, సాత్వికల శిష్యబృందంచే గోవర్ధన గిరిధారి, కృష్ణశబ్దం, ముద్దుగారే యశోద, మరకతమణిమయ, కృష్ణాష్టకం, చిన్ని శిశువు, బృందావన తిల్లాన తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి అలరించారు.

కెనరి ది స్కూల్‌లో..

మియాపూర్: మదీనాగూడలోని కెనరి ది స్కూల్‌లో శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా చేసుకున్నారు. శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో విద్యార్థులు అలరించారు. శ్రీకృష్ణుని జీవిత చరిత్రను తెలిపే నృత్య రూపకాలను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్. లిడియా క్రిస్టినా మాట్లాడుతూ చెడుపై మంచి విజయం అనే శ్రీ కృష్ణుడి సందేశాన్ని విద్యార్థులకు వివరించారు.



లింగంపల్లిలో పూజలు చేస్తున్న యాదవ సంఘం నాయకులు



మదీనాగూడలో అన్నప్రసాదం అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



ఖాజాగూడలో.. చిన్ని కృష్ణుడి వేషధారణలో ఓ చిన్నారి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలి

- సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పటాన్‌చెరు శ్రామిక భవన్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. బియ్యం, పప్పులు ,కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. 2014లో ధరలను పరిశీలిస్తే 50 శాతం నుండి 200 శాతం పెరిగాయని విమర్శించారు. కేంద్రం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్‌కోడ్‌లను తెచ్చి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం దళితులకు 3 ఏకరాల భూమి ఏమైందని ప్రశ్నించారు.డబుల్ ఇళ్లు అర్హులకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి, జార్జ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిరుపేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం ఉందని రాష్ట్ర శాసనమండలి మాజీ ప్రోటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి అన్నారు. గురువారం భారతినగర్ డివిజన్ పరిధిలో లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌గౌడ్, ఆదర్శ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, లింగమయ్య, పరమేష్ యాదవ్, యాదయ్య పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు

పేదల సంక్షేమమే ధ్యేయం

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌ల పరిధిలోని పలువురు లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, నార్నే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 200 మంది లబ్దిదారులకు చెక్కులను అందజేయటం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, పార్టీ కూకట్‌పల్లి అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈటీ ద్వారా 'మనూ'లో బీఈడీ ప్రవేశాలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా బీఈడీ, బీఎస్సీబీఈడీ, బీకామ్ కోర్సులలో ఆన్‌లైన్ అడ్మిషన్లను నిర్వహిస్తామని 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ)లో అర్హత సాధించి ఎన్‌సీఈటీని ఎంచుకున్న అభ్యర్థులు సెప్టెంబర్ 11 నుంచి 18వ తేదీ వరకు అడ్మిషన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. సెప్టెంబర్ 18వ తేదీ జాబితాను విడుదలవుతుందన్నారు. సెప్టెంబర్ 20వ తేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయబడుతుందన్నారు. అభ్యర్థులు సెప్టెంబర్ 21, 22వ తేదీలలో ఫీజు చెల్లించాలన్నారు. అభ్యర్థులు 10వ, 12వ లేదా తత్సమానమైన మదర్సాకోర్సులు, పదవ తరగతి, 12వ తరగతి మార్కుషీట్, ఎన్‌సీఈటీ ఫలితం, కేటగిరీ సర్టిఫికెట్ మొదలైనవాటిలో ఉర్దూ రుజువును భాష/సబ్జెక్టు/మీడియంగా అప్‌లోడ్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకోసం యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

సర్వాయి పాపన్న జీవితం ఆదర్శం



సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సర్దార్ సర్వాయి పాపన్న జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో గీత పారిశ్రామిక సహకార సంఘం వెలిమల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతిలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా చారిత్రక ట్యాంక్‌బండ్‌పై వారి విగ్రహాన్ని ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చారని తెలిపారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఫంక్షన్ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువుకట్టపై త్వరలోనే పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి , కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, సుచరిత కొమరయ్య, శ్రీశైలం, బాలాజీ, నాయకులు సోమిరెడ్డి,ఉమేష్, మాజీ సర్పంచ్ రాజ్యం మహిపాల్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైం జాబ్ అంటూ..

- సైబర్ వల.. రూ.26 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.26 లక్షలు పోగొట్టుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. రామచంద్రపురం మండల పరిధిలోని ఈదులనాగులపల్లికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్ కు ఆగస్టు 16వ తేదీన మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.10 వేలు చెల్లించాడు. దీంతో అపరిచిత వ్యక్తి తిరిగి రూ.13 వేలు బాధితుడికి వేశాడు. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.26 లక్షలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదు, కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయిన్నట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం బీడీఎల్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తను ప్రేమిస్తున్న వ్యక్తికి నిశ్చితార్థం కావడంతో మనస్థాపం చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన భెల్ కాలనీలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భెల్ కాలనీలో నివాసముండే సుంకర రాజేశ్వరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. ఇందులో ఇద్దరు కుమార్తెలకు వివాహం అయింది. కాగా రెండో కుమార్తె కవిత (36) వివాహం చేసుకోలేదు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రుల వద్దనే ఉంటుంది. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితో కవిత ప్రేమలో పడింది. వీరి ప్రేమ విషయం కవిత తల్లిదండ్రులకు గత మూడు నెలల క్రితం తెలిసింది. కాగా కవిత ప్రేమిస్తున్న వ్యక్తికి మరొక అమ్మాయితో గత కొద్దిరోజుల క్రితం నిశ్చితార్థం జరిగింది. ప్రియుడికి నిశ్చితార్థం కావడంతో కవిత ఎప్పుడు బాధపడుతూ ఉండేది. గురువారం ఉదయం కవిత స్నానం చేసేందుకు బాత్రూంలోకి వెళ్ళింది. ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు బాత్రూం తలుపులు తట్టినా ఆమె స్పందించలేదు. చుట్టుపక్కల నివాసముండే వారి సహాయంతో బాత్రూం తలుపులు పగలగొట్టారు. అప్పటికే బాత్రూంలో కవిత చున్నీతో ఇనుపరాడుకు ఉరేసుకుంది. వెంటనే కవితను పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కవిత ప్రేమించిన వ్యక్తికి మరొక అమ్మాయితో నిశ్చితార్థం జరగడంతో ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు వివరించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడోరోజూ ఆగిన రాకపోకలు

శేరిలింగంపల్లి: వర్షం తగ్గినా వరద ఆగలేదు. వరద నీరు తొలగకపోవడంతో లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద మూడోరోజు గురువారం కూడా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు లింగంపల్లి నుంచి నల్లగండ్ల ఆర్‌ఓబీ మీదుగా గచ్చిబౌలికి రాకపోకలు కొనసాగించారు. చాలా మంది ఉదయం లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వరకు వచ్చి చూసి పరిస్థితిలో మార్పులేకపోవడంతో తిరిగి ఆర్‌ఓబీ వరకు వెళ్ళి అక్కడి నుంచి తమ గమ్యస్థానాలకు రాకపోకలు కొనసాగించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు నీటి తొలగింపు పనులపై దృష్టి పెట్టారు.



నియామకాలు

- ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా మారెళ్ల శ్రీనివాస్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మారెళ్ల శ్రీనివాస్ గురువారం నియమితులయ్యారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జైపాల్ నియామకపత్రాన్ని అందించారు. అనంతరం భారత్ జోడో యాత్ర ప్రారంభించి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా లింగంపల్లిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మారెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, జైపాల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు.

బీజేపీ అధికార ప్రతినిధిగా సీతారామరాజు

భాగ్యనగర్‌కాలనీ: మేడ్చల్- మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా హైదర్‌నగర్‌కు చెందిన బొల్లేపల్లి సీతారామరాజును నియమించారు. గురువారం జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీతారామరాజు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థి గెలుపు కోసం శాయశక్తులా పనిచేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు.. జలమయం



ఖాజీపల్లిలోని ఓఆర్‌ఆర్ రింగురోడ్డు కింద భారీగా నీరు చేరిన దృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి-మల్లంపేట పరిధుల్లోని ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఓఆర్‌ఆర్ రింగు రోడ్డు సర్వీస్ రోడ్డుపై భారీగా నీరు నిల్వ ఉంది. ఈ రోడ్డు గుండా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షం పడ్డ ప్రతీసారి ఈ రహదారి నీటితో నిండిపోతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాకపోకలను పునరుద్ధరించేలా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. గడ్డపోతారం పారిశ్రామికవాడల్లోని పలు పరిశ్రమలు నీట మునిగాయి. రోడ్లు పూర్తిగా నీటితో నిండిపోయాయి. నాలాలను కబ్జా చేయటంతో ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.